సాక్షి చిత్తూరు

ఆదివారం । 29 । డిసెంబర్ । 2024




ఆలోచన మారింది!

నేడు నవతరం ఆలోచన ధోరణి మారింది. డబ్బులే ముద్దు.. పిల్లలు ఇప్పుడేవద్దని. స్వేచ్ఛాజీవనం సాగించాలని భావిస్తున్నారు. - 8లో



400 సెల్ ఫోన్ల అప్పగింత

పోగొట్టుకున్న, చోరీకి గురైన దాదాపు రూ.90 లక్షల విలువ చేసే 400 సెల్‌ఫోన్లను చిత్తూరు పోలీసులు బాధితులకు అప్పగించారు. - 8లో



అక్రమ క్వారీల సీజ్

కుప్పం మున్సిపాలిటీ పరిధిలోని శీగలపల్లి వద్ద అధికార పార్టీ నాయకుడు నిర్వహిస్తున్న క్వారీలను మైన్ అధికారులు సీజ్ చేశారు. - 8లో

న్యూస్‌రీల్

నేడు విద్యుత్ బిల్లు చెల్లింపునకు అవకాశం

చిత్తూరు కార్పొరేషన్: విద్యుత్ బిల్లులు ఆదివారం సైతం చెల్లించవచ్చని తిరుపతి, చిత్తూరు జిల్లాల ట్రాన్స్‌కో ఎస్‌ఈలు సురేంద్రనాయుడు, ఇస్మాయిల్‌అహ్మద్ శనివారం తెలిపారు. సెలవురోజు అయినప్పటికీ రెండు జిల్లాల్లోని బిల్లుల చెల్లింపుల కేంద్రాలు పనిచేస్తాయన్నారు. హెచ్‌టీ వినియోగదారులు 30వ తేదీలోపు బకాయిలు చెల్లించాలని సూచించారు. వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని బిల్లులు చెల్లించి, సంస్థకు సహకరించాలని కోరారు.

జిల్లా ప్రభుత్వాస్పత్రి అభివృద్ధి కమిటీ ఏర్పాటు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరులోని జిల్లా ప్రభుత్వాస్పత్రి డెవలెప్‌మెంట్ సొసైటీ నూతనంగా ఏర్పాటైంది. చైర్మన్‌గా కలెక్టర్ సుమిత్ కుమార్, కోచైర్మన్‌గా ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్ నియమితులయ్యారు. సభ్యులుగా ఎంపీ దగ్గుమళ్ల ప్రసాద్‌రావు, సురేష్ (సోషల్ సర్వీస్), విజయకుమార్ (సోషల్ సర్వీస్), అరుణ్‌కుమార్ (సూపరింటెండెంట్), డీఎంఅండ్‌హెచ్‌ఓ, వరలక్ష్మీభాయ్(నర్సింగ్ సూపరింటెండెంట్), నరసింహప్రసాద్(మున్సిపల్ కమిషనర్), ముని జయకుమార్, (ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్), డేగల రమేష్(దాత), ప్రభావతి (డీసీహెచ్‌ఎస్), విజయకుమార్ (ఇండియన్ మెడికల్ అసోసియేషన్)ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

పోర్ట్ పోలియో జడ్జితో ‘బార్’ నేతల భేటీ



జడ్జితో చిత్తూరు బార్ అసోసియేషన్ నేతలు

చిత్తూరు అర్బన్: రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి, జిల్లా పోర్ట్ పోలియో జడ్జి జస్టిస్ బి.కృష్ణమోహన్‌ను చిత్తూరు న్యాయవాద సంఘం(బార్) నేతలు శనివారం విజయవాడలో కలిశారు. బార్ ప్రధాన కార్యదర్శి అశోక్ ఆనంద్ యాదవ్, కోశాధికారి వెంకటపతి నాయుడు, క్రీడా కార్యదర్శి సుబ్రమణ్యం కలిశారు. చిత్తూరులో ఏసీబీ న్యాయస్థానం, ఫ్యామిలీ న్యాయస్థానం, ఎర్రచందనం కేసుల విచారణ న్యాయస్థానం ఏర్పాటుకు చొరవ చూపాలని కోరారు. అలాగే తిరుపతికి తరలించాలనకున్న గంజాయి కేసుల విచారణ కోర్టును చిత్తూరులోనే ఉంచాలని కోరినట్లు బార్ నేతలు తెలిపారు.

పల్లె పరిశుభ్రంగా ఉండాలి

పూతలపట్టు (కాణిపాకం): పల్లెలు పరిశుభ్రంగా ఉండాలని, అందుకు పారిశుద్ధ్యం మెరుగుపరచాలని డీపీఓ సుధాకర్‌రావ్ ఆదేశించారు. పూతలపట్టు మండలం చిటిపిరాళ్ల, పి.కొత్తకోట పంచాయతీలను ఆయన శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. డపింగ్‌యార్డు, వాటర్ ట్యాంక్, పల్లె పరిశుభ్రతను పరిశీలించారు. అలాగే పల్లెల్లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా తక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. కురుస్తున్న వర్షాల నేపథ్యంలో పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. దోమల నివారణకు పాగింగ్ చేయాలని సూచించారు.

జాతీయ స్థాయి కబడ్డీకి ఇద్దరు క్రీడాకారులు






క్రీడాకారులు గుల్జార్, అనిత

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని ఇద్దరు క్రీడాకారులు జాతీయస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలు మమత, కార్యనిర్వాహక కార్యదర్శి రవీంద్రరెడ్డి తెలిపారు. శనివారం వారు విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 8 నుంచి 12వ తేదీ వరకు ప్రకాశం జిల్లా సంతనూతనలపాడులో నిర్వహించిన రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో ప్రతిభ చూపి, జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. సీనియర్ కబడ్డీ పోటీల్లో సదుం గ్రామానికి చెందిన క్రీడాకారిణి గుల్జార్ జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. అలాగే ఈ నెల 22 నుంచి 25వ తేదీ వరకు తూర్పుగోదావరి జిల్లా రావులపాలెంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి జూనియర్ పోటీల్లో క్రీడాకారిణి అనిత జాతీయ స్థాయికి ఎంపికైనట్లు చెప్పారు. వీరిలో గుల్జార్ మహారాష్ట్రలో జనవరి 15 తర్వాత, అనిత ఉత్తరాఖండ్‌లో జనవరి 5 పైన నిర్వహించే జాతీయ పోటీల్లో ఏపీ తరపున పాల్గొననున్నట్లు వెల్లడించారు. ఇద్దరు క్రీడాకారులను అసోసియేషన్ నాయకులు అభినందించారు.

SUNDAY SPECIAL



దొరకునా ఇటువంటి సేవ..నీపద రాజీవముల చేరు..
నిర్వాణ సోపాన మదిరోహణం చేయుత్రోవ.. అంటూ
ఆ ఉపాధ్యాయులు నాడు చదివిన చోటే నేడు చదు
వులు చెబుతున్నారు. నాడు విద్యార్థిగా తరగతి గదిలో
చేసిన అల్లరి.. ఆలస్యంగా వస్తే టీచర్
వేయించిన గోదకుర్చీ.. క్లాసులో అల్లరి చేసిన
విద్యార్థులతో తీయించిన గుంజీళ్లు..హోమ్‌వర్క్
చేయని సహ విద్యార్థులు తిన్న బెత్తం దెబ్బలు..
సహచరులతో ఆడిన గుజ్జనగూళ్లు.. మారుపేర్లు పెట్టి
ఆట పట్టించిన చిలిపిచేష్టలన్నీ తాము చదివిన
పాఠశాలలోకి గురువుగా అడుగు పెట్టిన తొలిరోజే
గుర్తుకు వచ్చాయి. నిత్యం ఆ మధుర స్మృతులను
నెమరేసుకుంటూ విద్యార్థులకు బోధన చేస్తున్నారు.
ఇదంతా తమ పూర్వజన్మసుకృతంగా భావిస్తున్నారు.
ఒకనాడు తాము విద్యాభ్యాసం చేసిన స్కూలులో
గురువులుగా పనిచేస్తున్న నేపథ్యంలో
వారి మనోభావాలు..
వారి మాటల్లోనే..

– చిత్తూరు కలెక్టరేట్

దొరకునా ఇటువంటి సేవ..

చదివిన చోటే కొలువు

- పేద విద్యార్థులకు ఉత్తమ విద్యాబోధన
- పేద కుటుంబాల్లో జన్మించి.. ఉపాధ్యాయులుగా ఎదిగి..
- చదివిన పాఠశాల, కళాశాలల్లోనే నేడు విధులు నిర్వహిస్తూ..
- పూర్వవిద్యార్థులు...ప్రస్తుత టీచర్లు, లెక్చరర్లపై సాక్షి ప్రత్యేక కథనం

మరువలేని అనుభూతి



నేను మధ్యతరగతి వ్యవసాయ కుటుంబంలో జన్మించాను. మా కుటుంబం ఎప్పుడు వ్యవసాయ పనుల్లో నిమగ్నమై ఉండేవారు. నా తల్లిదండ్రులు చిన్నక్క, ఆదెయ్య. తమలాగా పిల్లలు వ్యవసాయ పనులు చేయకూడదనే ఉద్దేశంతో కష్టపడి చదివించారు. వారి కష్టాన్ని చిన్నతనం నుంచి కళ్లారా చూశాను. ఎలాగైన ప్రభుత్వం ఉద్యోగం సాధించాలనే కసితో చదువుకున్నారు. ప్రాథమిక విద్య పాదిరికుప్పం ప్రైమరీ పాఠశాలలో, 1993–95 వ సంవత్సరం వరకు స్వస్థలమైన పాదిరికుప్పం జెడ్పీ హైస్కూల్‌లో చదువుకున్నారు. తిరుపతి పద్మావతి యూనివర్సిటీలో బీఈడీ పూర్తి చేశాను. ఆ తర్వాత డీఎస్సీ పరీక్షలకు ఎక్కడా శిక్షణ పొందకుండానే సొంతంగా పరీక్షలకు సన్నద్ధం అయ్యాను. ఎస్జీటీ, స్కూల్ అసిస్టెంట్ పోస్టులకు డీఎస్సీలో అర్హత సాధించడంతో స్కూల్ అసిస్టెంట్‌గా విధుల్లో చేరాను. ప్రస్తుతం నేను చదివిన పాదిరికుప్పం జెడ్పీ హైస్కూల్‌లోనే హెచ్‌ఎంగా విధులు నిర్వహించే అదృష్టం దక్కడం, ఈ అనుభూతి మరువలేనిది. ఆర్థికంగా ఎదుగుదల ఉన్నప్పటికీ మా పిల్లలను ప్రభుత్వ పాఠశాలలోనే చదివిస్తున్నాను. నా బిడ్డకు నేనే టీచర్‌గా ఉండడం నా కెంతో ఆనందంగా ఉంది. విద్యాపరంగా, రాజకీయంగా పాదిరి కుప్పం గ్రామానికి ఎంతో పేరుంది. అలాంటి గ్రామంలో జన్మించిన నాకు ఇలాంటి అవకాశం లభించడం అదృష్టం.

– ద్రాక్షాయణి, పాదిరికుప్పం హైస్కూల్ హెచ్‌ఎం, కార్వేటినగరం మండలం

కలలో కూడా అనుకోలేదు!



మాది చిత్తూరు నగరంలోని రామ్‌నగర్ కాలనీ. తండ్రి షేక్ మహబుబ్ ఆడిట్ ఆఫీసర్ గా పనిచేసేవారు. తల్లి షేక్ హబీబూల్లా గృహిణి. మాది పెద్ద కుటుంబమే. నేను 1980లో చిత్తూరులోని పీసీఆర్ కళాశాలలో ఎస్ఎస్‌సీ పూర్తి చేశాను. అప్పట్లో క్లాస్‌లో ప్రథమస్థానం సాధించాను. చదువంటే మక్కువ ఎక్కువ. మా టీచర్ల ప్రోత్సాహం కూడా బాగుండేది. తర్వాత డిగ్రీ పీవీకేఎన్ కళాశాలలో చదివాను. 1989లో నెల్లూరులో బీఈడీ పూర్తి చేసి, అదే సంవత్సరంలో డీఎస్సీలో టీచర్‌గా ఎంపికయ్యాను. తర్వాత గంగాధరనెల్లూరు మండలం ఆవులకొండలో ఉర్దూ టీచర్‌గా తొలి పోస్టింగ్ అందుకుని విధులు నిర్వహించాను. ఆ తర్వాత ఉద్యోగోన్నతులు పొంది 2021 వ సంవత్సరంలో నేను చదివిన కళాశాల పీసీఆర్ కళాశాలలో ప్రిన్సిపల్‌గా విధుల్లో చేరాను. ఈ కళాశాలలో చదివి ఈ స్థాయికి వస్తానని కలలో కూడా అనుకోనే లేదు. ఆ రోజుల్లో మా ఉపాధ్యాయుల బోధనతోనే ఈ స్థాయికి చేరాను. నేను చదువుకున్న కళాశాలలో విద్యార్థులకు ఉత్తమ బోధన, క్రమశిక్షణ అలవాటు చేసి ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నాను.

– షేక్ అబ్దుల్ మజీద్, ప్రిన్సిపల్, పీసీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల, చిత్తూరు

చదివిన చోటే ఉద్యోగం.. నా అదృష్టం



మాది సామాన్య కుటుంబం. చిత్తూరు నగరంలోని కొంగారెడ్డిపల్లిలో ఉంటుంటాం. నేను 2003 వ సంవత్సరంలో పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీఎస్సీ పూర్తి చేశాను. 2006 లో ఎంసీఏ పూర్తి చేశాను. తండ్రి సి. సుబ్రహ్మణ్యం, తల్లి కళ్యాణి. తండ్రి పోలీస్ కావడంతో నన్ను కూడా పోలీస్ అవ్వాలని ప్రోత్సహించేవారు. చదువు పూర్తికాగానే ఎస్ఐ పరీక్షలు రాశాను. 2008లో సబ్ ఇన్‌స్పెక్టర్‌గా ఎంపికయ్యాను. అయితే ఎస్ఐ గా విధుల్లో చేరలేదు. 2009 వ సంవత్సరంలో ఏపీపీఎస్సీ నోటిఫికేషన్ విడుదల కావడంతో ఆ పరీక్షలు రాశాను. 2012 వ సంవత్సరంలో నేను చదువుకున్న పీవీకేఎన్ కళాశాలలోనే అధ్యాపకునిగా విధుల్లో చేరాను. ఆ తర్వాత పుంగనూరు పని చేసి, ప్రస్తుతం 2023 వ సంవత్సరం నుంచి పీవీకేఎన్ లోనే విధులు నిర్వహిస్తున్నాను. చదివిన కళాశాలలోనే విధులు నిర్వహించే అదృష్టం దక్కడం సంతోషంగా ఉంది. పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చదివిన ఎంతో మంది గొప్ప గొప్ప స్థానాల్లో ఉన్నారు. నేను చదువుకునే రోజుల్లో అధ్యాపకులు చాలా బాగా ప్రోత్సహించేవారు. ప్రోత్సాహం ఉంటే ఎంతటి కష్టాన్నైనా సాధించవచ్చు. గతం కంటే ప్రస్తుతం పీవీకేఎన్ ప్రభుత్వ కళాశాలలో సౌకర్యాలు ఎంతో మెరుగయ్యాయి. ప్రస్తుతం పీవీకేఎన్ ప్రభుత్వం కళాశాల స్వయం ప్రతిపత్తి స్థాయికి అభివృద్ధి చెందింది. నేను చదివిన పీవీకేఎన్ కళాశాలలో ఎంతో మంది పేద విద్యార్థులకు ఉత్తమ విద్యాబోధన, కళాశాల అభివృద్ధికి తన వంతు సేవలందిస్తున్నాను. తల్లిదండ్రుల ప్రోత్సాహంతోనే అధ్యాపకునిగా విధులు నిర్వర్తిస్తున్నాను.

– శరవణ, అధ్యాపకుడు, పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, చిత్తూరు

ఈ అవకాశం మహాభాగ్యం



నేను పుంగనూరు నియోజకవర్గం సదుం మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్‌లో 1985 నుంచి 1990వ సంవత్సరం వరకు విద్యాభ్యాసం చేశాను. ఇదే పాఠశాలలో 2017వ సంవత్సరంలో తెలుగు ఉపాధ్యాయునిగా విధుల్లో చేరాను. చదువుకున్న బడిలో ప్రస్తుతం ఉపాధ్యాయుడిగా పనిచేసే మహాభాగ్యం వస్తుందని కలలో కూడా ఊహించలేదు. ఈ పాఠశాలకు చుట్టుపక్కల చాలా గ్రామాల నుంచి పేద విద్యార్థులు విచ్చేస్తుంటారు. ఆ రోజుల్లో పేద కుటుంబం నుంచి వచ్చి ఇదే పాఠశాలలో చదువుకునే సమయంలో అప్పటి గురువులు చేసిన బోధనతోనే ఈ స్థాయికి వచ్చాను. అదే స్ఫూర్తితో మరింత మంది విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దేందుకు తన వంతు కృషి చేస్తున్నాను.

– సుబ్రహ్మణ్యం, తెలుగు టీచర్, సదుం జెడ్పీ హైస్కూల్, పుంగనూరు నియోజకవర్గం

పూర్వజన్మ సుకృతం



నేను యాదమరి మండలం పి.గొల్లపల్లి జెడ్పీ హైస్కూల్‌లో చదువుకున్నాను. ప్రస్తుతం నేను చదివిన పాఠశాలలోనే సోషల్ టీచర్‌గా విధులు నిర్వర్తిస్తున్నాను. చదివిన పాఠశాలలో పనిచేయడం ఎంతో సంతృప్తినిస్తోంది. చదివిన పాఠశాలకు తన వంతు ఏదో కొంత చేసే అదృష్టం దక్కడం నిజంగా నా పూర్వజన్మసుకృతం. మా పాఠశాలలో అప్పటి మా ఉపాధ్యాయులు నేర్పిన విలువలు నా విజయానికి కారణమయ్యాయి. చదివిన బడి అభివృద్ధికి, పేద విద్యార్థులకు ఉచితంగా ట్యూషన్ చెప్పడం చేస్తుంటాను. నా వంతు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తుంటాను.


– సునీల్ కుమార్, సోషల్ టీచర్, పి.గొల్లపల్లి, యాదమరి మండలం

10 మంది ఒకే పాఠశాలలో



ఒకరు కాదు ఇద్దరు కాదు ఏకంగా 10 మంది తాము చదువుకున్న పాఠశాలలో ప్రస్తుతం ఉపాధ్యాయులుగా విధులు నిర్వహిస్తున్నారు. జిల్లాలోని పుంగనూరు నియోజకవర్గం సదుం జెడ్పీ ఉన్నత పాఠశాలలో చదివిన రెడ్డిరాణి, శశికళ, టి.సుబ్రహ్మణ్యం, బి. సుబ్రహ్మణ్యం, జయకుమార్‌రెడ్డి, యుగంధర్, అమర్‌నాథ్, ఆంజనేయులు, సుధాకర్, కృష్ణయ్య ప్రస్తుతం అదే పాఠశాలలో ఉపాధ్యాయులుగా విధులు నిర్వహించారు. తమకు విద్యనందించిన ఉపాధ్యాయులతో కలిసి పనిచేస్తూ అరుదైన అనుభూతిని ఆస్వాదిస్తున్నారు. చదువుకున్న పాఠశాలకు తమ వంతు సాయంగా అనేక సేవా కార్యక్రమాలు చేపట్టి అభివృద్ధికి కృషి చేస్తున్నారు. తమ స్ఫూర్తితో మరింత మంది భవిష్యత్తు టీచర్లను తీర్చిదిద్దాలనే ఆశయంతో విధులు నిర్వర్తిస్తున్నారు. విద్యార్థులకు విద్యతోపాటు విలువలను నేర్పిస్తున్నారు. తాము బోధిస్తున్న పాఠ్యాంశాల్లో విద్యార్థులను ఉత్తమంగా తీర్చిదిద్దేందుకు ప్రణాళిక రూపొందించుకుని కృషి చేస్తున్నారు. ఏటా పదో తరగతి విద్యార్థులు వంద శాతం ఫలితాలు సాధించేలా శిక్షణ ఇస్తున్నారు. విద్యతో పాటు చదువుకున్న పాఠశాలకు తమ వంతు సహాయం చేస్తూ విద్యాభివృద్ధికి కృషి చేస్తున్నారు.

ఆదిత్యం.. ‘ఆద’ర్శం



విద్యుత్ నేడు నిత్యావసరం.. జల, థర్మల్, అణు కేంద్రాలే ప్రస్తుతం కరెంట్ ఉత్పత్తికి మూలం.. ఇవన్నీ తరగిపోయే ఇంధన వనరులే కాకుండా కాలుష్యకారకం.. వెరసి.. వాతవారణం కలుషితం.. పర్యావరణ విద్యుత్ ఉత్పత్తికి సౌరఫలకం ఒక్కటే మార్గం.. దీని ఏర్పాటుతో బిల్లులు ఆదాతోపాటు మిగులు గ్రిడ్‌కు విక్రయంతో వినియోగదారుడికి ఆదాయం.. పర్యావరణ హితం. ఈ దిశగా కేంద్రం అడుగు వేస్తోంది. అందుకు ఆదర్శగ్రామాలు ఎంపిక చేసి, ఉత్తమ ఉత్పత్తి గ్రామాలకు ప్రోత్సాహకం అందించనుంది. దీనిపై ప్రత్యేక కథనం.

- సౌరశక్తితో ఇంధనం ఆదా
- మోడల్ గ్రామానికి రూ.కోటి ప్రోత్సాహకం
- ప్రకటించిన కేంద్ర ప్రభుత్వం
- వందశాతం సోలార్ విద్యుత్ ఉత్పత్తే లక్ష్యం

చిత్తూరు కార్పొరేషన్: రానున్న రోజుల్లో జనాభాతో పాటు విద్యుత్ వాడకం పెరగనుంది. దీన్ని దృష్టిలో పెట్టుకుని కేంద్ర ప్రభుత్వం సంప్రదాయేతర విద్యుత్ ఉత్పత్తిపై దృష్టి సారించింది. ఇందుకోసం సూర్యఘర్ యోజన పథకం అమలు చేసింది. ఈ పథకం కింద పలు ఆర్థిక ప్రోత్సాహకాలను అందిస్తోంది. పట్టణాల కన్నాపల్లెల్లో సౌరవిద్యుత్ వినియోగంపై పెద్దగా ఆసక్తి చూపడం లేదు. సౌరవిద్యుత్‌పై ఆసక్తి పెంచడానికి కేంద్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాలపై దృష్టి సారించింది. ఇందుకు జిల్లాల పరిధిలో నియోజకవర్గాల వారీగా 5 వేలకు పైగా జనాభా ఉన్న పంచాయతీలను మోడల్ సోలార్ గ్రామాలుగా ఎంపిక చేసింది. ఆ గ్రామాల్లో కిలోవాట్ నుంచి మూడు కిలోవాట్ల వరకు సోలార్ ప్యానల్స్‌ను అమర్చుకుంటే రూ.30 వేలు, రూ.60 వేలు, రూ.78 వేలు చొప్పు లబ్ధిదారులకు రాయితీ అందజేసేందుకు కేంద్ర ప్రభుత్వం మార్గదర్శకాలను జారీ చేసింది. ఈ క్రమంలో ట్రాన్స్‌కో అధికారులు చిత్తూరు జిల్లా పరిధిలో ఎంపిక చేసిన పంచాయతీలోని స్థానికులకు సోలార్ పవర్ ఉత్పత్తికి అందిస్తున్న ప్రోత్సాహకాలపై అవగాహన సదస్సులు ఏర్పాటు చేయనున్నారు. వినియోగదారులు తమ దరఖాస్తులను పీఎం సూర్యఘర్ జీఓవీ.ఇన్ పోర్టల్‌లో నమోదు చేసుకోవడంపై విస్తృతంగా ప్రచారం చేపట్టనున్నారు.



గుడిపాలలోని బొమ్మసముద్రం గ్రామం

మోడల్ గ్రామాలివే

చిత్తూరు జిల్లాలోని పెనుమూరు మండలంలో పెనుమూరు గ్రామం, గుడిపాలలో బొమ్మసముద్రం, విజయపురంలో పల్లూరు, చౌడేపల్లెలో చౌడేపల్లె, పులిచెర్లలో కల్లూరు గ్రామాలను గ్రామ పంచాయతీలను మోడల్ సోలార్ గ్రామాలుగా ఎంపిక చేశారు.

5 వేలకు పైగా జనాభా కలిగిన ఈ పంచాయతీల్లో వంద శాతం ఇళ్లకు సోలార్ ప్యానల్స్ ఏర్పాటు చేసిన పంచాయతీకి రూ.కోటి నగదు ప్రోత్సాహకం అందజేస్తారు. ఈ నిధులను వివిధ అభివృద్ధి పనులకు వినియోగించుకునే సౌలభ్యం ఉంటుంది. వ్యక్తిగతంగా కరెంటు బిల్లు తగ్గించుకోవడంతోపాటు పర్యావరణ పరంగా ప్రయోజనాలను నిర్దేశించారు. మిగులు విద్యుత్‌ను గ్రిడ్‌కు ఎన్ని యూనిట్లు సరఫరా చేస్తారో.. ఆ మేరకు నగదు కూడా అందజేస్తారు. నిరంతరాయంగా కరెంటు ఇవ్వాలన్న లక్ష్యం నిమిత్తం సంప్రదాయేతర ఇంధన వనరులు వినియోగానికి ప్రత్యామ్నాయ మార్గాలపై కార్యచరణ చేపట్టనున్నారు.

ప్రచారం చేస్తాం



మోడల్ సోలార్ గ్రామాలుగా ఎంపిక చేసిన పంచాయతీల పరిధిలో మరింత ప్రచారం చేస్తాం. ప్రజలు భవనాలపై సోలార్ ప్యానళ్ల ఏర్పాటు చేసుకోవాలి. వీటి ద్వారా పొందే లబ్ధిని క్షేత్రస్థాయిలో తెలియజేయనున్నాం. గ్రామాల్లో సోలార్ పవర్‌పై పెద్ద ఆసక్తి చూపడం లేదు. ఈ పథకాన్ని ఉపయోగించుకుంటే భవిష్యత్‌లో ఎంతో ఉపయోగం. మీ విద్యుత్ మీరే ఉత్పత్తి చేసుకుని మిగిలిన యూనిట్లను గ్రిడ్‌కు అమ్ముకోవచ్చు. వంద శాతం సోలార్‌ను వినియోగించుకున్న పంచాయతీకు కేంద్ర ప్రభుత్వం రూ.కోటి రూపాయలను ప్రోత్సాహకంగా ఇవ్వనుంది. దీంతో పంచాయతీలో మరిన్ని అభివృద్ధి పనులు చేసుకోవచ్చు.

– ఇస్మాయిల్ అహ్మద్, ఎస్‌ఈ ట్రాన్స్‌కో

ఎస్సీ, ఎస్టీ నిఘా పర్యవేక్షణ కమిటీ సమావేశం రేపు

చిత్తూరు కలెక్టరేట్ : ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం అమలుపై ఈ నెల 30వ తేదీన కలెక్టరేట్‌లో జిల్లాస్థాయి ఎస్సీ, ఎస్టీ నిఘా పర్యవేక్షణ కమిటీ సమావేశం నిర్వహించనున్నట్లు జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ డీడీ రాజ్యలక్ష్మి తెలిపారు. శనివారం ఆమె విలేకరులతో మాట్లాడారు. కమిటీ చైర్మన్ కలెక్టర్ అధ్యక్షతన సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశానికి అవసరమైన ముందస్తు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. సోమవారం మధ్యాహ్నం 4 గంటలకు నిర్వహించే సమావేశానికి కమిటీ సభ్యులు తప్పక హాజరుకావాలని డీడీ కోరారు.

క్లుప్తంగా

ఏపీసీటీఎస్‌ఏ అధ్యక్షుడిగా పూర్ణం



ఉమ్మడి జిల్లా నూతన కార్యవర్గం

చిత్తూరు కార్పొరేషన్: ఆంధ్రప్రదేశ్ కమర్షియల్ ట్యాక్స్ సర్వీసెస్ అసోసియేషన్(ఏపీసీటీఎస్ఏ) ఉమ్మడి జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక ఏకగ్రీవం అయ్యింది. శనివారం చిత్తూరులో ఎన్నికల అధికారి వేణుగోపాల్, ఎన్నికల పరిశీలకులు పాణిగ్రాహి ఈ వివరాలను ప్రకటించారు. ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా పూర్ణం(చిత్తూరు-2 సర్కిల్), అసోసియేట్ అధ్యక్షుడిగా నవీద్‌బాషా(చిత్తూరు-2), ఉపాధ్యక్షులుగా వెంకటేశులు(గూడూరు), నాగరాజు(జేసీ ఆఫీసు), మదన్‌మోహన్(జేసీ ఆఫీసు), జగదీష్‌బాబు (చిత్తూరు-1), కార్యదర్శిగా గిరిధర్(జేసీ ఆఫీసు), కార్యనిర్వాహక కార్యదర్శిగా యోగేంద్ర బాబు(తిరుపతి-2) ఎన్నికయ్యారు. అలాగే సంయుక్త కార్యదర్శులుగా అనిల్‌కుమార్(తిరుపతి-2), ప్రవీణ్‌కుమార్(తిరుపతి-1), మాధవి(తిరుపతి-3), హరిప్రసాద్(జేసీ ఆఫీసు), కోశాధికారిగా సురేష్‌బాబు(పలమనేరు), మహిళ కార్యదర్శిగా లత(తిరుపతి-2), క్రీడ లు, సాంస్కృతిక కార్యదర్శిగా హరిబాబునాయక్(శ్రీకాళహస్తి) ఎన్నికైనట్లు ప్రకటించారు. వీరు మూడేళ్ల పాటు పదవిలో ఉంటారన్నారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని నూతన కార్యవర్గ సభ్యులు తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి



మధుకుమార్ మృతదేహం

సదుం: అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి చెందినట్లు పోలీసులు శనివారం తెలిపారు. వారి కథనం మేరకు.. చింతలవారిపల్లెకు చెందిన మధుకుమార్(32) శుక్రవారం రాత్రి మద్యం సేవించి నిద్రించాడు. కుటుంబ సభ్యులు ఉదయం ఎంత లేపినా నిద్ర లేవకపోవడంతో మృతి చెందినట్లు గుర్తించారు. అతని తల్లి మునెమ్మ కుమారుని మృతిపై అనుమానం ఉందని పోలీసులకు ఫిర్యాదు ఇచ్చారు. ఎస్ఐ షేక్‌షావలి ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతునికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కాగా సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా ఉన్న అతనికి సంవత్సరం కిందట ఉద్యోగం పోవడంతో మద్యానికి బానిసై..అతిగా మద్యం సేవిస్తున్నట్లు తమ విచారణలో తెలిసిందని ఎస్ఐ చెప్పారు.

శ్మశానం లోడేస్తున్నారంటూ ఆందోళన



ఆందోళన చేస్తున్న గుడికండ్రిగ వాసులు

నగరి : మండలంలోని గుడికండ్రిగ గ్రామంలో జాతీయ రహదారి ఏర్పాటులో భాగంగా శ్మశానాన్ని లోడేస్తున్నారని స్థానికులు ఆందోళనకు దిగారు. శనివారం జాతీయ రహదారి ఏర్పాటులో భాగంగా వంతెన నిర్మాణానికి జాతీయ రహదారి సిబ్బంది ఇటాచీ వాహనంతో శ్మశానాన్ని తవ్వడం ప్రారంభించారు. ఈ విషయం తెలుసుకున్న గ్రామస్తులు ఇటాచీ వాహనాన్ని అడ్డుకున్నారు. శ్మశానానికి దారి లేకుండా వంతెన నిర్మిస్తే తాము శ్మశానానికి ఎలా వెళ్లాలని ఆగ్రహం వ్యక్తం చేశారు. దారి చూపి వంతెన నిర్మించాలంటూ పని జరిగే ప్రాంతంలోనే బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. దీంతో అధికారులకు తెలిపి, మళ్లీ పనులు ప్రారంభిస్తామని సిబ్బంది వెనుదిరిగారు.

ఆలోచన మారింది!

కలల ప్రపంచం.. ఊహా లోకం.. స్వేచ్ఛా జీవనం.. ఇందుకు చిన్న కుటుంబమే లక్ష్యం.. ఇద్దరూ సంపాదిస్తేనే సుఖ జీవనం అన్న సిద్ధాంతం.. దీని ఆచరణకు సంపాదనే ధ్యేయం.. ఇవన్నీ చేజిక్కించుకున్నా తమ తమ షరతులకు అబ్బాయి.. అతడి బంధువులు అంగీకరిస్తేనే వివాహం.. ఆ తరువాత నివాసానికి సొంత భవనం..ఆపై మరి కొంతకాలం ఆగిన తరువాతే సంతానం.. ఇదీ నేటి నవతరం ఆలోచన.. అదే నడుస్తోంది ప్రస్తుతం. ఆదివారం ప్రత్యేకంగా నవతరం దంపతుల తీరుపై ప్రత్యేక కథనం.

- ముందు సంపాదన ఆపై పిల్లలంటున్న నవతరం దంపతులు
- జీవితాన్ని ఆస్వాదించేందుకే ప్రాధాన్యం

పలమనేరు: ప్రస్తుతం లేట్ మ్యారేజెస్ ఎక్కువ. గతంలో తల్లిదండ్రులు మాట మేరకు జరిగే వివాహాలే అధికం. ఇప్పుడు పిల్లల ఇష్టా ఇష్టాల ఆధారంగా నిర్ణయాలు తీసుకుంటున్నారు. పెళ్లికుమార్తె డిమాండ్లకు పెళ్లికొడుకు కుటుంబం అంగీకరిస్తేనే పెళ్లి.. లేదంటే లేదు. గతంలో వయసు మీరితే ఏమీ ఇంకా పెళ్లి చేయలేదా? అనే వారు. తీరా పెళ్లి కాగానే ఏమీ పిల్లలను కనరా? అని అడిగేవారు. కానీ ఇప్పుడు తొలుత కొలువు.. ఆపై జీవితంలో స్థిరపడిన తరువాతే వివాహం అన్న ట్రెండ్ రాజ్యమేలుతోంది. ఇక సాఫ్ట్‌వేర్‌లైతే ఇప్పటిదాకా బిజీలైఫ్‌లో ఉన్నాం.. కొన్నాళ్లయినా ఎంజాయ్ చేద్దామనే మాట సిటీలో వినిపిస్తోంది. కొందరు వివాహం చేసుకున్నా కొన్నాళ్లు జీవితాన్ని ఆస్వాదించి.. కావాలనుకున్నప్పుడు పిల్లలను కందాంలే అని మాట్లాడే జంటలు మెట్రోపాలిటిన్ సిటీలో షరా మామూలైంది. ఇప్పటివరకు నగరాల్లో ఉన్న డ్యూయల్ ఇన్‌కం నో చిల్డ్రన్స్ అనే సంస్కృతి సిటీలు దాటి పట్టణాలకు పాకింది.

నచ్చిన జీవితం అనుభవించాలని..

గతంలో తల్లిదండ్రులు సర్కిల్‌లో ఉన్న పిల్లలు, ఇప్పుడు ఉద్యోగాలు పొంది డబ్బు సంపాదిస్తున్నందున ఐ వాంట్ టు ఓన్ స్పేష్ అంటూ నచ్చిన జీవితాన్ని కోరుకుంటున్నారు. గతంలో ఉన్నత కుటుంబాలకు చెందిన వారే ప్రొఫెషనల్ కోర్సులు, సాఫ్ట్‌వేర్ కొలువులు చేసేవారు. ఇప్పుడలా కాదు ఉద్యోగ అవకాశాలు పెరగడంతో మధ్యతరగతి కుటుంబాల పిల్లలు సైతం చాలామంచి సాఫ్ట్‌వేర్ రంగంలో ఉన్నారు. చదువుకునే రోజుల్లో కేవలం విద్యపైనే ధ్యాస, ఆపై ఉద్యోగం కోసం వెతుకులాట, మళ్లీ ప్రొబేషన్ పీరియడ్, తర్వాతే జాబ్ గ్యారెంటీ అయి, కాస్త జీతాలు పెరుగుతాయి. ఇదే సమయంలో సొంత ఫ్లాట్ కలను నిజం చేసుకునేందుకు కష్టాలు తప్పవు. దీంతో వీరి జీవితంలో ఎంజాయ్‌మెంట్ తక్కువ, బిజీ లైఫ్ ఎక్కువగా ఉంటుంది. ఆపై పెళ్లి చేసుకున్నాక కొన్నాళ్లు జీవితాన్ని ఎంజాయ్ చేసి, ఆపై తీరిగ్గా పిల్లలను కనాలనే మాట వినిపిస్తోంది.

ఇద్దరూ ఉద్యోగులే.. పిల్లల పోషణ ఎలా..

మెట్రోపాలిటన్ సిటీలో భార్యాభర్తలిద్దరూ సాఫ్ట్‌వేర్ ఉద్యోగులై ఉండడం లేదా ఏదో జాబ్‌లో ఉంటూ పొద్దున వెళ్లి రాత్రి ఇంటికి వస్తున్నారు. వీరు పిల్లలను కంటే వారి పోషణ వీరికి భారంగా మారుతోంది. లేదా పిల్లలను చూసుకునేందుకు ఎవరూ ఉండరు. ఇంట్లో తమ పిల్లల్ని చూసుకుంటారా? అంటే సొంత కుటుంబసభ్యులు, బంధువులు కూడా వెళ్లడం లేదు. కేర్ టేకర్ల ద్వారా పిల్లలను పర్యవేక్షించినా.. ఆపై వారికి నర్సరీ నుంచి కాన్వెంట్ చదువులు, బడికి సిద్ధం చేయడం, ఫీజులు, స్కూల్ బస్సు ఎక్కించడం ఇదంతా డ్యూయల్ ఇన్‌కమ్ తల్లిదండ్రులకు కష్టతరంగా మారుతోంది. దీంతో పెళ్లి చేసుకుని నాలుగైదేళ్లు ఆ య్యాక బాగా సెటిలై, నాలుగురాళ్లు వెనకేసుకుని ఆపై పిల్లలను కందాంలే అనే భావన నవతరంలో పెరుగుతోంది.



ఇదీ కొందరి పరిస్థితి

పలమనేరుకు చెందిన కిరణ్(పేరుమార్చం) నాలుగేళ్ల కిందట బీటెక్ చదవి, బెంగళూరులో పీజీలో ఉంటూ నానా కష్టాలు పడి ఓ కంపెనీలో ఉద్యోగం సంపాదించాడు. వారిచ్చే జీతం చాలక నాలుగైదు కంపెనీలు మారి, ఇప్పుడు నెలకు రూ.90 వేలు జీతం పొందుతున్నాడు. ఆరునెలల క్రితం అదే కంపెనీలో పనిచేసే సాఫ్ట్‌వేర్ అమ్మాయిని వివాహం చేసుకున్నాడు. బ్యాంకు లోన్ తీసుకుని ఫ్లాట్ కొనుక్కున్నారు. ఇద్దరి జీతంలో సగం ఇన్‌స్టాల్‌మెంట్‌కు పోతోంది. దీంతో ఐదేళ్లు పిల్లలొద్దని డిసైడ్ చేసుకున్నట్టు తెలిపాడు.

ఇప్పుడంతా ట్రెండ్ మారింది

గతంలో పెళ్లిచూపుల్లో అబ్బాయి, అమ్మాయి ఇష్టపడితే పెద్దలు కట్నకానుకలు మాట్లాడుకొనేవారు. ఇప్పుడు ట్రెండ్ మారింది. అమ్మాయి తరపువారు షరతులు పెడుతున్నారు. అత్తామామలతో మా పాప ఉండదు.. బంధువులు ఎక్కువగా ఇంటికి రాకూడదు.. మా అమ్మాయి ఇప్పుడే పిల్లలను కనదంటూ తెగేసి చెబుతున్నారు. చిన్నప్పటి నుంచి అమ్మాయి ఇంగ్లిష్ మీడియం స్కూల్, ఆపై కార్పొరేట్ కాలేజీ, హాస్టల్, ఎంట్రెన్స్‌లకు శిక్షణ, మళ్లీ జాబ్ ఇలాగే సరిపోయింది.. ఏనాడు జీవితాన్ని ఎంజాయ్ చేయలేదు.. అందుకే కొన్నాళ్లు పిల్లలు వద్దంటోంది అంటున్నారు. తీరా ఈ డిమాండ్లకు ఓకే అంటనే పెళ్లి జరిగేది. ఇద్దరూ సంపాదిస్తూ బిజీగా ఉండడంతో వీకెండ్ పార్టీలు, విహారయాత్రలు, నచ్చిన ప్రాంతాలకు వెళ్లడం, విదేశీ ప్యాకేజీ టూర్లు ఇలా మనమిద్దరమేనంటూ జాలీ జాలీగా గడుపుతున్న కల్చర్ ఇప్పుడు ఫ్యాషన్‌గా మారింది.

వయసు పెరిగితే ఇబ్బందులు



సాధరణంగా 25 ఏళ్ల నుంచి 30 ఏళ్ల లోపు మహిళలు ప్రసవం జరిగితే జన్మించే పిల్లలు ఆరోగ్యంగా ఉంటారు. వయసు పెరిగేకొద్దీ సంతానం కోసం ఇబ్బందులు తప్పవు. ఇటీవల కాలంలో తమకు బిడ్డలు పుట్టడం లేదని ఎగ్ ఫ్రీజింగ్, సెమన్ ఫ్రీజింగ్ చేసుకుంటున్న కేసులు ఎక్కువగా కనిపిస్తున్నాయి.

–డా. మమతారాణి, సూపరింటెండెంట్, ఏరియా ఆస్పత్రి, పలమనేరు

వ్యక్తిగత స్వేచ్ఛ కోసమే వాయిదా



భార్యాభర్తలిద్దరూ ఉద్యోగాలు చేస్తుంటారు. వీరికి ఆర్థికంగా స్థిరపడాలని, వ్యక్తిగత స్వేచ్ఛ కావాలనే దంపతులు బిడ్డలను కనడం వాయిదా వేసుకుంటున్నారు. మారిన జీవనశైలి ఇందుకో కారణం. గతంలో ఉమ్మడి కుటుంబాల్లో పెద్దలే పిల్లల్ని పెంచేసేవారు. కానీ ఇప్పుడు చిన్న కుటుంబాలే ఎక్కువ. వీటిలో అన్నీ భార్యాభర్తలే చూసుకోవాలి.

–డా. శారద, ఆర్ఎంఓ, ఏరియా ఆస్పత్రి ,పలమనేరు

400 సెల్‌ఫోన్ల అప్పగింత

చిత్తూరు అర్బన్: సెల్‌ఫోన్లు పోగొట్టుకోవడం, కొన్నిసార్లు ఫోన్లు చోరీకి గురవడం లాంటి ఘటనలను ఛేదించిన చిత్తూరు పోలీసులు దాదాపు రూ.90 లక్షల విలువ చేసే 400 సెల్ ఫోన్లను బాధితులకు అప్పగించారు. శనివారం చిత్తూరులోని పోలీసు అతిథిగృహంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎస్పీ మణికంఠ చందవోలు ఈ వివరాలను వెల్లడించారు. ఫోన్లను పోగొట్టుకున్న వారు, చోరీకి గురైనట్లు గుర్తించిన బాధితులు వాటి వివరాలను పోలీసుశాఖకు 9440900004 వాట్సాప్ నంబర్‌కు హాయ్ అని మెసేజ్ పెట్టడం, సీఈఐఆర్ అనే వెబ్‌సైట్‌లో వివరాలు నమోదు చేసుకోవడం ద్వారా ఫోన్లను కనిపెట్టి.. అప్పగించడానికి చర్యలు తీసుకుంటామని ఎస్పీ తెలిపారు. జిల్లాలో వచ్చిన ఫిర్యాదులపై దర్యాప్తు చేసి బాధితుల వద్ద ఉన్న వివరాల ఆధారంగా ఫోన్లను దేశంలోని ఏపీ, తమిళనాడు, కర్ణాటక, కేరళ, మహారాష్ట్ర తదితర రాష్ట్రాల్లో రికవరీ చేశామని చెప్పారు. ఇందుకోసం



పోలీసులు స్వాధీనం చేసుకున్న సెల్ ఫోన్లు

పోలీసుశాఖ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా ఐటీ విభాగం పనిచేస్తోందన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు పది దఫాల్లో 3,085 సెల్‌ఫోన్లను బాధితులకు అప్పగించామన్నారు. వీటి విలువ రూ.6.51 కోట్లు ఉంటుందన్నారు. సెల్‌ఫోన్లను రికవరీ చేసిన సీసీఎస్ సీఐ ఉమామహేశ్వరరావు, సిబ్బంది బాపూజీ, రఘురామ్, శ్రీనివాస్ ఇతర సిబ్బందికి సర్టిఫికెట్లను అందజేసిన ఎస్పీ, వారిని అభినందించారు. ఈ సమావేశంలో స్పెషల్ బ్రాంచ్ సీఐ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు

దుబాయ్ నుంచి ఫోన్..

దేశం నుంచి కాకుండా ఇతర దేశాల్లో ఉన్న ఫోన్లను సైతం చిత్తూరు పోలీసులు వెనక్కి తెప్పించగలిగారు. అన్నమయ్య జిల్లా మదనపల్లెకు చెందిన శ్రీనివాస్ అనే వ్యక్తి తన ఐఫోన్-15 ప్రో ఫోన్‌ను రెండు నెలల క్రితం పోగొట్టుకున్నాడు. దీనిపై చాట్‌బాట్‌లో ఫిర్యాదు చేశాడు. తొలుత ఫోన్‌ను బెంగళూరులో ఓ వ్యక్తికి లభించగా, అతడి నుంచి కడపకు చెందిన మరో వ్యక్తి కొనుగోలు చేశాడు. ఆపై ఇతను దుబాయ్ వెళ్లిపోయాడు. దర్యాప్తు చేపట్టిన పోలీసులు సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా దుబాయ్‌లో ఉన్న వ్యక్తికి ఫోన్ చేసి అసలు విషయం చెప్పారు. శనివారం తన స్నేహితుడు దుబాయ్ నుంచి ఇండియా రావడంతో అతని వద్ద ఐ-ఫోన్ పంపాడు. దీన్ని ఎస్పీ బాధితులకు అప్పగించారు. ఇక చిత్తూరు నగరానికి చెందిన మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ హరికిషోర్ తన ఫోన్‌ను ఇటీవల పోగొట్టుకున్నాడు. ఓ లారీ డ్రైవర్‌కు ఫోన్ దొరకడంతో అతను కర్నూలు వైపు వెళుతుంటే ఒక్క రోజులో లొకేషన్ కనిపెట్టి, ఫోన్‌ను అక్కడి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ ఫోన్‌ను సైతం ఎంవీఐ హరికిషోర్‌కు ఎస్పీ అప్పగించారు.

అక్రమ క్వారీల సీజ్



అక్రమ క్వారీలో దిమ్మెలకు మార్కింగ్ వేస్తున్న మైన్స్ అధికారులు

కుప్పంరూరల్: మున్సిపాలిటీ పరిధిలోని శీగలపల్లి వద్ద అధికార పార్టీ నాయకుడు నిర్వహిస్తున్న క్వారీలను శనివారం మైన్స్ అధికారులు సీజ్ చేశారు. వివరాల్లోకి వెలితే... శీగలపల్లి గ్రామానికి చెందిన ఓ అధికార పార్టీ నాయకుడు గ్రామానికి దూరంగా నాలుగు చోట్ల క్వారీలు నిర్వహిస్తున్నాడు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో గుట్టుచప్పుడు లేకుండా క్వారీ తతంగం సాగిస్తూ వస్తున్నాడు. పగటి పూట దిమ్మెలను చెక్కడం, రాత్రి పూట తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు చడీచప్పుడు లేకుండా తరలించేవాడు. శనివారం కొంత మంది గ్రామస్తుల ఫిర్యాదు మేరకు మైనింగ్ అధికారులు క్వారీలపై దాడులు చేశారు. ఎలాంటి అనుమతులు లేని క్వారీలు నిర్వహిస్తుండడంతో వాటిని సీజ్ చేశారు. క్వారీల్లోని సుమారు 50 వరకు దిమ్మెలపై మార్కింగ్ వేసి, సీజ్ చేశారు. ఈ దాడుల్లో మైన్స్ ఇన్‌స్పెక్టర్ చంద్రమోహన్, టెక్నికల్ అసిస్టెంట్ భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

వి.కోట వాసులు ఇద్దరు కర్ణాటకలో అరెస్టు

- కోలారులో గంజాయి విక్రయం
- 23 కిలోల గంజాయి స్వాధీనం

వి.కోట : మండలానికి చెందిన ఇద్దరు వ్యక్తులు గంజాయి విక్రయిస్తుండగా కర్ణాటక పోలీసులు అరెస్టు చేసి, వారి వద్ద నుంచి రూ.23 లక్షల విలువ చేసే గంజాయి స్వాధీనం చేసుకున్నారు. వివరాల్లోకి వెళితే.. వి.కోట మండలానికి చెందిన ఫాసిల్, అబ్దుల్ అలీ, అలాగే కోలార్ నగరానికి చెందిన సయ్యద్ అన్వర్ బాషా, షాబాజ్ బాషా, సాకిబ్ మహ్మద్ కలసి గంజాయి వ్యాపారం చేస్తున్నారు. ఈ క్రమంలో శనివారం కర్ణాటక రాష్ట్రం కోలార్ జిల్లా మాలూరు పట్టణంలోని ఏపీఎంసీ వద్ద వి.కోట మండలానికి చెందిన ఫాసిల్, అబ్దుల్ ఆలీ వద్ద ముందస్తు ఒప్పందం ప్రకారం కోలార్ నగరానికి చెందిన సయ్యద్ అన్వర్ బాషా, షాబాజ్ బాషా, సాకిబ్ మహ్మద్ గంజాయి కొనుగోలు చేయడానికి వచ్చారు. ముందస్తు సమాచారంతో కర్ణాటక పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని, వారిని అరెస్టు చేసి, వారి వద్ద ఉన్న రూ. 23 లక్షల విలువ చేసే 23 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అలాగే నిందితుల నుంచి 5 సెల్‌ఫోన్లు కూడా స్వాధీనం చేసుకున్నారు.



స్వాధీనం చేసుకున్న గంజాయి, నిందితుల అరెస్టు చూపుతున్న కర్ణాటక పోలీసులు

ముగ్గురు మహిళల అరెస్టు

- 58 గ్రాముల బంగారం స్వాధీనం

చిత్తూరు అర్బన్: ఒంటరి మహిళ ఆటోలో వెళుతుండగా తోటి ప్రయాణికుల్లా ఆటో ఎక్కిన ముగ్గురు మహిళలు బంగారు ఆభరణాలను చోరీ చేశారు. వారిని పోలీసులు శనివారం అరెస్టు చేసి, 58 గ్రాములు బంగారం స్వాధీనం చేసుకున్నారు. టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో సీఐ నెట్టికంటయ్య ఈ వివరాలను మీడియాకు వెల్లడించారు. యాదమరి మండలం ఎర్రచేనుకు చెందిన జ్ఞానమ్మ అనే మహిళ ఈనెల 26వ తేదీన చిత్తూరు రామ్‌నగర్ కాలనీలో ఉంటున్న తన కొడుకు ఇంటికి వెళ్లారు. అదే రోజు మధ్యాహ్నం యాదమరి వెళ్లడానికి చిత్తూరు నగరంలోని దర్గా కూడలిలో ఆటో ఎక్కి.. ఓ బ్యాగులో రూ.20 వేల నగదు, బంగారు చైను, రెండు బంగారు గాజులు, రెండు జతల కమ్మలు, మూడు ఉంగరాలు, ఓ బంగారు కాసు మొత్తం 59 గ్రాముల బరువున్న బంగారు ఆభరణాలను ఓ పర్సులో పెట్టుకున్నారు. ఈమె తన బంధువుల ఇళ్లకు వెళ్లినా, ఇంట్లో ఉన్న నగలు, నగదు తనతో పాటు తీసుకెళ్లడం ఆనవాయితీ. ఈ నేపథ్యంలో కాజూరు కూడలి వద్ద ముగ్గురు మహిళలు ఆటో ఎక్కారు. జ్ఞానమ్మ తన ఊరి వద్ద ఆటో దిగి డబ్బులు ఇవ్వడానికి పర్సు చూస్తే కనిపించలేదు. కాజూరు వద్ద ఆటో ఎక్కిన ముగ్గురు మహిళలు పర్సు కత్తిరించుకుని వెళ్లినట్టు గుర్తించి.. పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. చిత్తూరు నగరం మంగసముద్రం హౌసింగ్ కాలనీకి చెందిన మేకల దుర్గ (49), తోట లలిత (30), గంట లలిత (32)ను అరెస్టు చేశారు. ఈ ముగ్గురి నుంచి రూ.4.10 లక్షల విలువ చేసే 58 బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. నిందితులు ముగ్గురిపై గతంలో తొమ్మిది కేసులు ఉన్నట్టు గుర్తించారు. వీరిని అరెస్టు చేసి, న్యాయమూర్తి ఎదుట హాజరుపరచగా 14 రోజుల రిమాండ్‌కు ఆదేశించారు. అనంతరం ముగ్గురు మహిళలను చిత్తూరులోని జిల్లా జైలుకు తరలించారు. ఈ సమావేశంలో ఏఎస్ఐలు వై.మల్లీశ్వరి, ఆంజనేయులు, సిబ్బంది పాల్గొన్నారు.



మహిళా నిందితుల అరెస్టు చూపుతున్న టూటౌన్ పోలీసులు

చోరీ కేసులో దొంగలు..

యాదమరి (కాణిపాకం): ఆభరణాల చోరీ కేసులో దొంగలను శనివారం అరెస్టు చేసినట్టు సీఐ శ్రీధర్ తెలిపారు. సీఐ శ్రీధర్ కథనం మేరకు.. యాదమరి మండలం ఎర్రచేను గ్రామంలోని ఓ ఇంట్లో ఆగస్టు 8వ తేదీన బంగారం, వెండి, ఆభరణాలు చోరీ అయ్యాయి. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. తమిళనాడు రాష్ట్రం అంబూరుకు చెందిన విక్రమ్ (24), పరదారామికి చెందిన సెల్వరాజ్ (18)ను చోరీ చేసినట్లు గుర్తించి, వారిని అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.6.80 లక్షల విలువ చేసే 170 గ్రాముల బంగారం, రూ. 10 వేలు విలువ చేసే వెండి, రూ.1.20 లక్షలు విలువ చేసే రెండు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. వీటి మొత్తం విలువ రూ.8.10 లక్షలు ఉంటుందని పోలీసులు అంచనా వేశారు. ఇదే కేసులో ఏ-1 ఉన్న తమిళనాడు రాష్ట్రం పేర్నంబట్టుకు చెందిన ఈశ్వరన్ నుంచి రూ.1.90 లక్షలు విలువ చేసే 47.5 గ్రాముల బంగారం స్వాధీనం చేసుకున్నట్లు సీఐ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ ఈశ్వరయ్య, సిబ్బంది పాల్గొన్నారు.



దొంగల అరెస్టు చూపుతున్న పోలీసులు